PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 213 | సంపుటి 4 | ఆదివారం | 19-04-2026 | పేజీలు 4 | వెల 3/- | ఎడిటర్ పి. రవిచంద్ర




- సీఐ 'అరైవ్ అలైవ్' ప్రచారానికి భారీ స్పందన
- రహదారి నిబంధనలపై అవగాహన సదస్సులు
- వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న కేసముద్రం పోలీసులు
- మత్తు వదిలిస్తున్నారు.. ప్రాణాలు కాపాడుతున్నారు
- కేసముద్రం సీఐ ద్విముఖ వ్యూహం

2

## 'అరైవ్ అలైవ్'

# ప్రాణ రక్షణే ప్రధాన లక్ష్యం

## కేసముద్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ వెలుగులు



"ప్రమాదం పిలవకనే వస్తుంది.. కానీ అప్రమత్తత ప్రాణాలను కాపాడుతుంది. వేగం ఇచ్చే క్షణికానందం కంటే, మీ కోసం ఇంట్లో ఎదురుచూసే ప్రాణాల విలువ చాలా పెద్దది. రహదారి నిబంధనలు అనేవి శిక్షల కోసం కాదు, క్షేమంగా ఇంటికి చేర్చడం కోసమేనని చాటిచెబుతున్నారు కేసముద్రం సీఐ. 'అరైవ్ అలైవ్' (Arrive Alive) అనే ఒక వినూత్న నినాదంతో, కేవలం చట్టాన్ని అమలు చేసే అధికారిగా మాత్రమే కాకుండా, ఒక బాధ్యతగల కుటుంబ సభ్యుడిగా ఆయన రోడ్డుపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. లాఠీకి పని చెప్పకుండా, మాటతో మనసు మార్చే ఈ 'ఫ్రెండ్లీ పోలీసింగ్' ప్రయోగం ఇప్పుడు మండలంలో ఒక సామాజిక విప్లవంగా మారుతోంది. కేవలం రోడ్డు భద్రతే కాకుండా, యువతను పట్టి పీడిస్తున్న గంజాయి మహమ్మారిపై కూడా ఆయన యుద్ధం ప్రకటిస్తూ, రేపటి తరాన్ని సన్మార్గంలో నడిపిస్తున్నారు."

—కేసముద్రం, ప్రభాత గమనం

## బయ్యారంలో గ్రీన్ స్టీల్..

- హైదరాబాద్‌ను ఈవీ హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం
- గ్రీన్ స్టీల్ ప్లాంట్‌తో పరిశ్రమల విస్తరణకు పథకం
- తెలంగాణ రైజింగ్-2047 విజన్‌కు కేంద్ర సహకారం కోరిన సీఎం రేవంత్ రెడ్డి
- పారిశ్రామికాభివృద్ధికి కొత్త దిశగా రాష్ట్ర ప్రతిపాదనలు

4



## ఐపీఎల్ బెట్టింగ్

# ముఠా గుట్టురట్టు

- ఐపీఎల్ ఫీవర్.. ఆన్లైన్ బెట్టింగ్ జోరు: వరంగల్ టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు
- వెబ్ సైట్ల ముసుగులో జూదం.. ఒకే ఇంట్లో పట్టుబడ్డ ఐదుగురు పందెం రాయుళ్లు
- నగదుతో పాటు స్మార్ట్ ఫోన్లు సీజ్.. ప్రధాన సూత్రధారి దిలీప్ కుమార్ కోసం గాలింపు
- మధ్యకోట నుంచి మిల్స్ కాలనీ వరకు.. క్రికెట్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు
- టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ యాక్షన్ ప్లాన్.. ముమ్మరంగా సాగుతున్న దర్యాప్తు




"ఐపీఎల్ క్రికెట్ పండుగను కొందరు జూదరులు కాసుల వేటగా మార్చుకుంటున్నారు. మైదానంలో ఆటగాళ్లు పరుగుల కోసం కష్టపడుతుంటే, ఇక్కడ వెబ్‌సైట్ల ముసుగులో ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో సామాన్యుల జేబులకు చిల్లు పెడుతున్నారు. వరంగల్ నగరంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ ఆన్‌లైన్ దందాను టాస్క్ ఫోర్స్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. మెరుపు దాడులతో బెట్టింగ్ ముఠా గుట్టురట్టు చేసి, లక్షలాది రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. పందెం రాయుళ్లపై ఉక్కుపాదం మోపుతూ టాస్క్ ఫోర్స్ పోలీసులు విసిరిన ఈ వల చివరకు ఎక్కడి వరకు వెళ్తుందనేది ఇప్పుడు నగరంలో హాట్ టాపిక్ గా మారింది."

— 2లో

## వరంగల్ వారసత్వ సంపదను

# భవిష్యత్ తరాలకు అందిద్దాం

- ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక వేడుకలు
- హనుమకొండలో ఘనంగా నిర్వహించిన హెరిటేజ్ కార్యక్రమం
- ప్రజాప్రతినిధులు, అధికారులు, కళాకారుల సమక్షంలో వేడుకలు
- వారసత్వ ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమాలు
- ప్రధాన ఆకర్షణగా పేరిణి శివతాండవం



హనుమకొండలో ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వరంగల్ చారిత్రక వారసత్వాన్ని భావితరాలకు అందించాలని ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో పేరిణి శివతాండవం నృత్య ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

— వివరాలు 2లో

# సురక్షిత ప్రయాణం బంగారు భవిష్యతుకు సోపానం

- సీఐ 'అరైవ్ అలైవ్' ప్రచారానికి భారీ స్పందన
- రహదారి నిబంధనలపై అవగాహన సదస్సులు
- వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న కేసముద్రం పోలీసులు
- మత్తు వదిలిస్తున్నారు.. ప్రాణాలు కాపాడుతున్నారు
- కేసముద్రం సీఐ ద్విముఖ వ్యూహం

## కేసముద్రంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ వెలుగులు




**కేసముద్రం, ఏప్రిల్ 18(ప్రభాత గమనం ):**
మానవ జీవితంలో సమయం ఎంత విలువైనదో, ప్రాణం అంతకంటే విలువైనది. నేటి వేగవంతమైన ప్రపంచంలో సెకన్ల కాలం ఆదా చేయడానికి ప్రాణాలను పణంగా పెడుతున్న వారు ఎందరో. ఈ నేపథ్యంలో, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం సీఐ గారు చేపట్టిన 'అరైవ్ అలైవ్' (Arrive Alive) కార్యక్రమం కేవలం ఒక ప్రభుత్వ నినాదంగా కాకుండా, ఒక సామాజిక ఉద్యమంగా మారుతోంది.

### ఫ్రెండ్లీ పోలీసింగ్ - కొత్త ఒరవడి

సాధారణంగా పోలీస్ అంటే భయం, లాఠీ, జరిమానాలు గుర్తుకు వస్తాయి. కానీ కేసముద్రం సీఐ ఈ భావనను మార్చేశారు. ప్రజలతో మమేకమవుతూ, తప్పు చేసిన వారిని దండించడం కంటే, తప్పు జరగకుండా అవగాహన కల్పించడం మిన్న అని ఆయన నిరూపిస్తున్నారు. రోడ్డుపై వాహనదారులను ఆపి, ఆప్యాయంగా పలకరిస్తూ భద్రతా నియమాలపై ఆయన ఇచ్చే కౌన్సెలింగ్ ప్రజల హృదయాలను తాకుతోంది.

### రహదారి భద్రత: ప్రాణ రక్షణే పరమావధి

కేసముద్రం మున్సిపాలిటీగా మారిన తర్వాత రోడ్లు వెడల్పు అయ్యాయి, వాహనాల రద్దీ పెరిగింది. ఈ క్రమంలో ప్రమాదాల తీవ్రతను తగ్గించడానికి సీఐ కొన్ని కీలక అంశాలపై దృష్టి పెట్టారు:

**హెల్మెట్ & సీట్ బెల్ట్:** "శిరస్సు ఉంటేనే కదా శిరస్త్రాణం (హెల్మెట్) అవసరం?" అంటూ హాస్యం జోడిస్తూనే, హెల్మెట్ ప్రాముఖ్యతను వివరిస్తున్నారు. 80% ప్రాణాపాయం కేవలం హెల్మెట్, సీట్ బెల్ట్ వల్ల తప్పుతుందని గణాంకాలతో సహా వివరిస్తున్నారు.

**వేగ నియంత్రణ:** "వేగం క్షణికానందం.. ప్రమాదం జీవితాంతం విషాదం". గమ్యాన్ని త్వరగా చేరడం కంటే, క్షేమంగా చేరడమే విజయమని ఆయన సందేశం.

**మత్తుకు దూరం:** మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం అంటే అది మీకు మాత్రమే కాదు, ఎదురుగా వచ్చే అమాయకులకు కూడా మరణ శాసనమేనని హెచ్చరిస్తున్నారు.

### సామాజిక రుగ్మతలపై ఉక్కుపాదం

రోడ్డు భద్రతతో పాటు యువత భవిష్యత్తును చిదిమేస్తున్న గంజాయి వినియోగంపై సీఐ గారు రాజీలేని పోరాటం చేస్తున్నారు. మండలంలోని మారుమూల గ్రామాల్లో సైతం ముందస్తు తనిఖీలు నిర్వహిస్తున్నారు. యువతకు, విద్యార్థులకు గంజాయి వల్ల కలిగే శారీరక, మానసిక మరియు న్యాయపరమైన ఇబ్బందులపై ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. "మత్తును వదిలి.. చదువుపై మక్కువ పెంచుకోండి" అనే నినాదంతో యువతను సన్మార్గంలో నడిపిస్తున్నారు.

### కుటుంబానికి భరోసా

ప్రతి వాహనదారుడి వెనుక ఒక కుటుంబం ఉంటుందని, తండ్రి కోసం పిల్లలు, భర్త కోసం భార్య, కొడుకు కోసం తల్లిదండ్రులు నిరీక్షిస్తుంటారని సీఐ గుర్తు చేస్తున్నారు. "మీరు క్షేమంగా ఇంటికి చేరడమే మీ కుటుంబానికి మీరు ఇచ్చే అతిపెద్ద బహుమతి" అని ఆయన చెప్పే మాటలు వాహనదారుల్లో మార్పు తెస్తున్నాయి.





## చలాన్లకు బదులు గులాబీలు

- పోలీస్ అధికారుల వినూత్న ప్రచారం..!
- చావు అంచు దాకా వెళ్లొద్దు..హెల్మెట్ పెట్టుకోండి
- వాహనదారులకు పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై వంశీకృష్ణ సూచన

**వరంగల్ క్రైమ్ బ్యూరో, ప్రభాత గమనం :**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 'అరైవ్ అలైవ్' నినాదంతో శనివారం రోజున సంగెం మండల కేంద్రంలో రోడ్డు భద్రత పై భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పర్వతగిరి సీఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ రాజ్ కుమార్,ఎస్సై వంశీకృష్ణ,ఎంపీడీఓ రవీందర్,ఇతర అధికారులు పాల్గొన్నారు.

### గాంధీగిరి స్టైల్లో అవగాహన

రోడ్డు భద్రతా నియమాల పై అవగాహన కల్పిస్తూ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను ఆపి,మందలించకుండా వారికి ప్రేమతో పువ్వులు ఇచ్చి నిబంధనలు పాటించాలని కోరడం అందరినీ ఆకట్టుకుంది.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్,కార్ డ్రైవర్లు సీట్ బెల్ట్ ధరించాలని అధికారులు సూచించారు.

### గ్రామాల్లో హెల్మెట్ల పంపిణీ:

కుంటపల్లి గ్రామంలో సర్పంచ్ సువర్ణ తో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు.గ్రామంలో హెల్మెట్ కొనే స్తోమత లేని 20 మంది వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు.అదేవిధంగా కాపులకనపర్తి, లోహిత గ్రామాల్లో కూడా సర్పంచ్ల సహకారంతో అవగాహన సదస్సులు నిర్వహించి, హెల్మెట్ల ప్రాధాన్యతను వివరించి పలువురికి పంపిణీ చేశారు.ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరాలన్నదే మా తపన అని,హెల్మెట్ భారం కాదు,అది మీ ప్రాణ రక్షణ కవచం అని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు,ప్రజా ప్రతినిధులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## భూసేకరణ ప్రక్రియలో వేగం పెంచాలి

- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హనుమకొండ: 18 ఏప్రిల్, ప్రభాత గమనం :**
జిల్లాలో చేపట్టిన పలు ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ ప్రక్రియలో స్పష్టమైన పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో గౌరవెల్లి, దేవాదుల, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే, ఆర్వోబీలకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, పనుల పురోగతి, భూభారతి దరఖాస్తులు, మీసేవ సర్టిఫికెట్ల పరిష్కారం తదితర అంశాలపై అదనపు కలెక్టర్ ఎన్. రవితో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు గౌరవెల్లి, దేవాదుల, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే మరియు ఇతర ప్రాజెక్టుల భూసేకరణ స్థితిగతులు, పురోగతిపై వివరాలు సమర్పించారు. కలెక్టర్ వాటిని సమీక్షించి అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆర్వోబీలకు సంబంధించిన భూసేకరణలో పెండింగ్లో ఉన్న అంశాలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణ, పెగ్ మార్కింగ్ వంటి కీలక పనుల్లో క్షేత్రస్థాయిలో పురోగతి ఉండాలన్నారు. జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పెగ్ మార్కింగ్, పనుల పురోగతిపై వారానికోసారి సమీక్షలు నిర్వహిస్తున్నందున, ప్రతి శాఖ నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ, ఆర్ అండ్ బి ఈఈ సురేష్ బాబు, దేవాదుల ఈఈ మంగీలాల్, గౌరవెల్లి ప్రాజెక్ట్ డీఈ చైతన్య, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, తహసీల్దార్లు అధికారులు పాల్గొన్నారు.

## ఐపీఎల్ బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

- ఐదుగురి అరెస్ట్, రూ.లక్షకుపైగా నగదు సీజ్
- ముగ్గురు పరారీ

**వరంగల్, ప్రభాత గమనం :**
ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ల నేపథ్యం లో సాగుతున్న ఆన్లైన్ బెట్టిం గ్లపై వరంగల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి నిర్వ హించారు. మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్స్ట పరిధిలో బెట్టిం గ్ నిర్వ హిస్తున్న ఒక నిర్వా హకుడితో పాటు నలుగురు పందెం రాయుళ్లనుళ్ల శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఏ. మధుసూదన్ నేతృత్వం లోని బృందం దాడులు నిర్వ హించింది. పలు వెబ్సైట్ల ద్వారా ఆన్లైన్ బెట్టింగుకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. ఒక నిర్వాహకుడు, నలుగురు పందెం రాయుళ్లు మొత్తం ఐదుగురిని అరెస్టు చేశారు. ముగ్గురు పరారీలో ఉన్నారు. రూ.1,02,000 నగదు, 5 స్మా ర్ట్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

### అరెస్టయిన నిందితుల వివరాలు


నిర్వాహకుడు తాడెం భరత్, వరంగల్ మధ్యకోట నివాసి. ఇతను ప్రధానంగా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. లౌడ్యా వెంకన్నది వరంగల్ ఎస్.ఆర్ నగర్. పైడి శ్రీధర్ వరంగల్ కొత్తవాడ వాసి. వంగ రమేష్ ది వరంగల్ కరీమాబాద్, ములుక శ్రీనివాస్ ది వరంగల్ ఎస్.ఆర్.ఆర్ తోట. ఈ కేసులో సంతోష్ కుమార్ (హన్మకొండ), పూల శ్రీకాంత్ (శంభునిపేట), రంగారెడ్డి జిల్లా ఎల్బీ నగర్ కు చెందిన మరో నిర్వాహకుడు రావుల దిలీప్ కుమార్ పరారీలో ఉన్నారు. వీరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదు, ఫోన్లను తదుపరి చర్యల నిమిత్తం మిల్స్ కాలనీ పోలీసులకు అప్పగించారు. ఈ దాడిలో టాస్క్ ఫోర్స్ ఏసీపీ ఏ. మధుసూదన్, ఇన్స్పెక్టర్ రాజు, ఆర్ఎస్ఐ భాను ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.











## వరంగల్ వారసత్వ సంపదను భవిష్యత్ తరాలకు అందిద్దాం

- హనుమకొండలో ప్రపంచ వారసత్వ దినోత్సవ వేడుకలు
- ప్రధాన ఆకర్షణగా పేరిణి శివతాండవం

**హనుమకొండ, ఏప్రిల్ 18 (ప్రభాత గమనం):**
ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో శనివారం సాయంత్రం ప్రత్యేక కార్యక్రమం ఘనంగా జరిగింది. కాకతీయ పట్టణ అభివృద్ధి సంస్థ (కుడా), కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజులు మాట్లాడుతూ వరంగల్ నగరానికి ఉన్న గొప్ప చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. వరంగల్ను కాకతీయుల వైభవానికి ప్రతీకగా నిలిపిన చారిత్రక కట్టడాలు, కళా సంపదను ప్రపంచానికి విస్తృతంగా పరిచయం చేయాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ, వరంగల్ కోట, రామప్ప దేవాలయం, వేయి స్తంభాల గుడి, లక్నవరం సరస్సు వంటి చారిత్రక ప్రదేశాలు వరంగల్కు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాయని చెప్పారు. ఈ వారసత్వ సంపదను కాపాడి యువతకు పరిచయం చేయడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, వరంగల్ అంటేనే కాకతీయ సామ్రాజ్యానికి కేంద్రంగా నిలిచిన ప్రాంతమని తెలిపారు. UNESCO గుర్తింపు పొందిన రామప్ప ఆలయం రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు. వరంగల్ వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తే పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, భద్రకాళి, వేయి స్తంభాల గుడి, ఐనవోలు దేవాలయాల పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రతి నెల మూడో శనివారం హెరిటేజ్కు సంబంధించిన ప్రత్యేక నృత్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

### ఆద్యంతం ఆకట్టుకున్న పేరిణి శివతాండవం

ప్రపంచ వారసత్వ దినోత్సవ వేడుకల్లో తెలంగాణ సాంప్రదాయ నృత్య రూపమైన పేరిణి శివతాండవం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. గజ్జెల రంజిత్ బృందం ప్రదర్శించిన ఈ నృత్యం ప్రేక్షకులను ముగ్ధులను చేసింది. శివుని ఉగ్ర తాండవ రూపాన్ని ప్రతిబింబించే ఈ నృత్యంలో శౌర్యం, ఉత్సాహం, ఆధ్యాత్మికత అద్భుతంగా మేళవించబడ్డాయి. డప్పుల మోత, ఘంటాల నినాదాల మధ్య నర్తకుల వేగవంతమైన కాళ్ల కదలికలు, దృఢమైన భంగిమలు వేదికను ఉత్సాహభరితంగా మార్చాయి. ప్రతి అడుగు, ప్రతి తాళంలో శివుని శక్తిని సజీవంగా ఆవిష్కరించిన కళాకారులు ప్రేక్షకుల్లో ఉత్సాహాన్ని నింపారు. నృత్యం అనంతరం కళాకారులను ప్రజాప్రతినిధులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కళాభిమానులు, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్
- తాళ్లపూసపల్లిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**కేసముద్రం, ఏప్రిల్ 18(ప్రభాత గమనం ):**
రైతులు పండించిన ప్రతి గింజకు మద్దతు ధర కల్పించి, అన్నదాతల ముఖాల్లో చిరునవ్వు చూడటమే ప్రభుత్వ లక్ష్యమని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీ నాయక్ అన్నారు. శనివారం కేసముద్రం మండల పరిధిలోని తాళ్లపూసపల్లి గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (ప్యాక్స్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రభుత్వం మొదటిసారిగా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమని, ఇది రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.ప్రభుత్వం మొక్కజొన్న క్వింటాలుకు రూ. 2,400 మద్దతు ధర ప్రకటించిందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.క్షేత్ర స్థాయిలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, రైతులు నేరుగా తమ పంటను విక్రయించుకుని లాభం పొందేలా ఈ కేంద్రాలు పనిచేస్తాయని భరోసా ఇచ్చారు.తాళ్ల పూసపల్లిలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా ఆ గ్రామంతో పాటు చుట్టుపక్కల పరిసర ప్రాంతాల రైతులకు రవాణా ఇబ్బందులు తప్పుతాయని, తద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి, స్థానిక సర్పంచ్లు, జిల్లా మరియు మండల స్థాయి ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పార్టీ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## పాత కక్షలతో వృద్ధుడి హత్య..

**భూపాలపల్లి, ప్రభాతగమనం :**
మొగుళ్లపల్లి మండలం రంగాపురం గ్రామంలో పాత కక్షల కారణంగా వృద్ధుడు హత్యకు గురైన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రంగాపురం గ్రామానికి చెందిన చిలువేరు పోశయ్య (66) గ్రామపంచాయతీ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఏప్రిల్ 4న సాయంత్రం అదే గ్రామానికి చెందిన ఇనుగాల కుమారస్వామితో వాగ్వాదానికి దిగాడు. ఈ వాగ్వాదం క్రమంగా ఘర్షణగా మారడంతో, నిందితుడు కుమారస్వామి తన వద్ద ఉన్న కర్రతో పోశయ్య తలపై పలుమార్లు బలంగా దాడి చేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన పోశయ్యను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య చిలువేరు నరసమ్మ ఫిర్యాదు మేరకు నిందితుడు ఇనుగాల కుమారస్వామిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉండగా, చిట్యాల సీఐ మల్లేష్ పర్యవేక్షణలో మొగుళ్లపల్లి ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### సామాజిక ఆర్థిక సర్వే రెమ్యునరేషన్
## వెంటనే చెల్లించాలి

- టీపీటీఎఫ్ మహబూబాబాద్ మండల ప్రధాన కార్యదర్శి సారెడ్డి రామలింగారెడ్డి

**మహబూబాబాద్ ఏప్రిల్ 18(ప్రభాత గమనం):**
తెలంగాణలో సామాజిక, ఆర్థిక సర్వేలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని జన గణన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ మండల ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ మహబూబాబాద్ మండల ప్రధాన కార్యదర్శి సారెడ్డి రామలింగారెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రంలో 2024 నవంబర్ నెలలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే కి సంబంధించిన రెమ్యునరేషన్ ఇంతవరకు చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. ఎన్నోసార్లు అధికారులకు విన్నవించుకున్నా ఇంతవరకు ఆ రెమ్యూనరేషన్ చెల్లింపు విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులకు రావాల్సిన రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి ప్రవీణ్, నాగరాజు,చాంప్ల,దబ్బా నరేష్, తల్లాడ శ్రీనివాసరావు, సత్యనారాయణరెడ్డి, వీరబ్రహ్మం, రాజేశ్వర్, కొండ్లె రాము, రామకృష్ణ, సత్యవతి అన్నపూర్ణ, ప్రతిభ, గీతా వాణి, శివ రంజని, సంధ్య, వాణి, రాజకుమారి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

## టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

**మహబూబాబాద్ ఏప్రిల్ 18(ప్రభాత గమనం):**
ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ లో జర్నలిస్ట్ లకు, వారి కుటుంబసభ్యులకు టియుడబ్ల్యూజే(ఐజేయు) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు టియుడబ్ల్యూజే మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, జిల్లా ప్రధానకార్యదర్శి గాడిపల్లి శ్రీహరి శనివారం నాడు ఓ ప్రకటనలో తెలిపారు.ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం అయ్యే ఈ ఉచితవైద్యశిబిరాన్ని విజయ్ గ్యాస్ట్రో అండ్ లివర్ క్లినిక్ వారి సహకారంతో టియుడబ్ల్యూజే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ విజయ్ రాంపల్లి తోపాటు పలువురు వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహిస్తారని వారు తెలిపారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా లివర్ పనితీరు, కొవ్వుశాతం, భవిష్యత్తు ప్రమాదాలను తెలిపే సుమారు రూ.7వేల రూపాయల విలువైన ఫైబ్రోస్కాన్ పరీక్ష ను ఈ శిబిరంలో ఉచితంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఫైబ్రోస్కాన్ పరీక్ష చేయించుకునేవారు, పరీక్షకు నాలుగుగంటల ముందునుంచి ఏమి తినకుండా ఉండాలని వైద్యులు సూచించారని తెలిపారు.

# పోచమ్మ మైదాన్ జంక్షన్‌లో 'అరైవ్ అలైవ్'

- యమడు, చిత్రగుప్తుడి వేషధారణతో ట్రాఫిక్ పోలీసుల సందేశం



**వరంగల్ క్రైమ్ బ్యూరో, ప్రభాతగమనం :**
నగరంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు, ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించేందుకు ట్రాఫిక్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' ప్రచారం కొనసాగుతోంది. ఈ ప్రచారం భాగంగా శనివారం పోచమ్మ మైదాన్ జంక్షన్ వద్ద వినూత్న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ ట్రాఫిక్ సిబ్బందితో కలిసి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుజాత పాల్గొన్నారు. రోడ్డు భద్రతా నియమాలను ప్రజలకు సులభంగా, ప్రభావవంతంగా చేరవేయడానికి పోలీస్ సిబ్బంది యమధర్మరాజు, చిత్రగుప్తుడు వేషధారణలో ప్రత్యక్షమై సందేశాలు అందించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వినూత్న ప్రదర్శన వాహనదారులను ఆకట్టుకుని, రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తత కలిగించింది. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం ఎంత ముఖ్యమో, నాలుగు చక్రాల వాహనదారులకు సీట్ బెల్ట్ వినియోగం ప్రాణాపాయాలను ఎంతవరకు తగ్గించగలదో వివరించారు. అలాగే ట్రాఫిక్ సిగ్నల్స్‌ను తప్పకుండా పాటించడం, వేగ పరిమితులను మించకుండా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తున్న వాహనదారులను గుర్తించి వారిని అభినందిస్తూ "ఛాంపియన్" స్టిక్కర్లు పంపిణీ చేశారు. ఈ చర్య వాహనదారుల్లో బాధ్యతాయుత డ్రైవింగ్‌కు ప్రోత్సాహం కలిగించింది. కార్యక్రమం సందర్భంగా అదనపు డీసీపీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల సహకారం అత్యంత కీలకమని తెలిపారు. ట్రాఫిక్ నియమాలు కేవలం జరిమానాల భయంతో పాటించాల్సినవి కాదని, ప్రతి ఒక్కరి ప్రాణ భద్రత కోసం అవి రూపొందించబడిన వని స్పష్టం చేశారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వంటి సాధారణ భద్రతా చర్యలు అనేక ప్రాణాలను కాపాడగలవని ఆయన పేర్కొన్నారు. రోడ్డు భద్రత వ్యక్తిగత బాధ్యత మాత్రమే కాకుండా సామాజిక బాధ్యత కూడా అని ట్రాఫిక్ పోలీసులు ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమం ద్వారా నగరంలో రోడ్డు భద్రతపై చైతన్యం పెంపొందించి, ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యమని ట్రాఫిక్ అధికారులు తెలిపారు.



# కేసముద్రంలో సినీ సందడి

- 'ఆటోవాలా', 'నాకు టైమ్ వచ్చింది' సినిమాల ఆడిషన్స్ ప్రారంభం

**కేసముద్రం ఏప్రిల్ 18(ప్రభాత గమనం):**
మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో శనివారం సినీ కళాకారుల సందడితో కళకళలాడింది. స్థానిక గోవర్ధనగిరి కాంప్లెక్స్‌లో 'ఆటోవాలా' మరియు 'నాకు టైమ్ వచ్చింది' అనే రెండు చిత్రాలకు సంబంధించిన నటీనటుల ఎంపిక (ఆడిషన్స్) ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ ఆడిషన్స్ శని, ఆదివారాలు రెండు రోజుల పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. నటనపై ఆసక్తి ఉన్న యువతీ యువకులు, సింగర్స్,రైటర్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొదటి రోజు జరిగిన ఎంపిక ప్రక్రియకు ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుండి భారీ సంఖ్యలో కళాకారులు తరలివచ్చారు.ఈ సినిమాల ప్రత్యేకత ఏంటంటే.. అత్యధిక భాగం మన ప్రాంతంలోనే చిత్రీకరించనున్నారు. కేసముద్రం, మానుకోట, బయ్యారం, గంధంపల్లి, కారకుండ్ల, కస్తూరి నగర్, భీముని పాదం అలాగే కేసముద్రం బడి తండా వంటి సుందర ప్రాంతాల్లో త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుంది.ఈ సందర్భంగా చిత్ర యూనిట్ సభ్యులు మాట్లాడుతూ.. "మానుకోట గడ్డ ఎంతో మంది దిగ్గజాలను సినీ పరిశ్రమకు పరిచయం చేసిందని తెలిపారు. ఆస్కార్ విజేత చంద్రబోస్, ప్రముఖ గేయ రచయిత కాసర్ల శ్యామ్, దివంగత సంగీత దర్శకుడు చక్రి, నేటి సెన్సేషన్ భీమ్స్ సిసిరోలియో, జబర్దస్త్ రాజమౌళి వంటి ఎందరో ఈ మట్టి బిడ్డలే అని కొనియాడారు. అదే స్ఫూర్తితో మరికొంత మంది కొత్త టాలెంట్‌ను వెలికితీయడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు.అనంతరం అరుంధతి సేవ ట్రస్ట్ చైర్మన్ లొకేషన్ ఇన్చార్జ్, మూవీ మేనేజర్ భూక్య బిజెపి నితిన్ బాలు నాయక్ మాట్లాడుతూ.. ఇప్పటికే మానుకోట పరిసరాల్లో చిత్రీకరించిన 'రాజు వెడ్స్ రాంబాయి', 'ప్రభుత్వ సారాయి దుకాణం' వంటి చిత్రాలు మంచి గుర్తింపు పొందాయని, త్వరలో విడుదల కానున్న 'సర్పంచ్ సాబ్' చిత్రాన్ని కూడా ప్రేక్షకులు ఆదరించాలని కోరారు. బయ్యారం గుట్ట చుట్టుపక్కల ప్రాంతాలు సినిమా షూటింగులకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 'ఆటోవాలా' హీరో నిర్మాత రమకాంత్, మరో చిత్రం హీరో నిర్మాత డానియల్,సినీకాళాకారులు ఉప్పరపల్లి మంద సాయిబాబా, బొట్టు రమేష్, లక్ష్మణ్, మహేష్ వేలాద్రి, ఐలేష్, భారత్, శోభ, కమల, భూక్య నితిన్, దుష్యంత్, గంధసిరి అశ్విని పాల్గొన్నారు.

# కులరహిత సమాజ స్థాపనే లక్ష్యం

- ఏప్రిల్ 30న 'సాంస్కృతిక ఉత్సవాలు'
- వీడీసీలను వెంటనే నిషేధించాలి: కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు సాదుల శ్రీనివాస్
- మానుకోటలో జరిగే ఉత్సవాలకు తరలిరావాలని పిలుపు

**మహబూబాబాద్ ఏప్రిల్ 18( (ప్రభాత గమనం):**
78 ఏళ్ల స్వతంత్ర భారతంలో నేటికీ కులమత వైశమ్యాలు కొనసాగడం అత్యంత విచారకరమని, సాటి మనిషిని సమానంగా చూసే 'సమానత్వ భావన'ను పెంపొందించాల్సిన అవసరం ఉందని కేవీపీఎస్ రాష్ట్ర నాయకులు సాదుల శ్రీనివాస్ అన్నారు. శనివారం మహబూబాబాద్‌లోని పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో నిర్వహించిన 'కులరహిత సాంస్కృతిక ఉత్సవాల' నిర్వహణ కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. సామాజిక విప్లవకారుడు జ్యోతిబాపూలే (ఏప్రిల్ 11), రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ (ఏప్రిల్ 14) జయంతుల నేపథ్యంలో ఏప్రిల్ నెల మొత్తాన్ని 'మహనీయుల మాసంగా' పాటిస్తున్నట్లు తెలిపారు. కుల వివక్ష, అంటరానితనం వంటి సామాజిక జాడ్యాలను రూపుమాపడానికి సాంస్కృతిక చైతన్యం అవసరమని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రంలో దళితులు, అట్టడుగు వర్గాలపై జరుగుతున్న దౌర్జన్యాల పట్ల ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణలో సుమారు 200 గ్రామాల్లో వీడీసీల (గ్రామ అభివృద్ధి కమిటీలు) పేరిట నిమ్న కులాల ప్రజలపై దౌర్జన్యాలు కొనసాగుతున్నాయని, ప్రభుత్వం వెంటనే ఈ కమిటీలను నిషేధించాలని డిమాండ్ చేశారు.గత పదేళ్ల కాలంలో రాష్ట్రంలో 143 కుల దురహంకార హత్యలు జరగడం సమాజం సిగ్గుపడాల్సిన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నెల 30న మహబూబాబాద్ (మానుకోట)లోని ఐఎంఏ హాల్లో నిర్వహించే 'కులరహిత సాంస్కృతిక ఉత్సవాలకు' దళితులు, సామాజిక శక్తులు భారీగా తరలిరావాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ ఉత్సవాల్లో జానపద కళాకారులు, డప్పు కళాకారులు పాల్గొని తమ కళా రూపాల ద్వారా సామాజిక చైతన్యాన్ని రగిలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మందుల యాకూబ్, జిల్లా నాయకులు మందుల మహేందర్, డొంకని దర్గయ్య, శేషం శ్యామ్, మచ్చ ఎంకన్న తదితరులు పాల్గొన్నారు.




## ఏడు రోజుల సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు




**మహబూబాబాద్ ఏప్రిల్ 18(ప్రభాత గమనం):**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు ఏడు రోజుల పాటు సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు.శనివారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో తో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో షెడ్యూల్ కులములు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ గురుకులాల్లో, విద్యాలయాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, విద్య విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని, వసతి గృహాల్లో మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, వసతులపై చర్చించాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, వేసవి శిబిరం, బడి బాట కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని అన్నీ ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ గురుకులాల్లో, వసతి గృహాల్లో వంటగది, పారిశుద్ధ్యం, మరమ్మతు పనులు చేపట్టాలని, విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించాలని, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ట్రైబల్ వెల్ఫేర్ సంచాలకులు దేశీరాం ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫలించిన సీపీఎం పోరాటం

- తాళ్లపూసపల్లిలో మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం
- కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మురళీ నాయక్
- సమస్యల పరిష్కారానికి వినతి పత్రం అందజేసిన సీపీఎం నాయకులు



**కేసముద్రం ఏప్రిల్ 18(ప్రభాత గమనం):**
రైతుల పక్షాన సిపిఎం చేసిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. తాళ్లపూసపల్లి గ్రామంలో రైతులు పండించిన మొక్కజొన్నలను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, శనివారం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. గతంలో ఈ కేంద్రం కోసం సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రాస్తారోకోకు స్పందించి, హామీ మేరకు కేంద్రాన్ని ఏర్పాటు చేసిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ కు సిపిఎం పార్టీ కృతజ్ఞతలు తెలిపింది.శనివారం మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న, వార్డు మెంబర్ తులసిమొగ్గ రాజశేఖర్ మాట్లాడుతూ.. సిపిఎం నిత్యం కార్మికులు, ప్రజలు, ముఖ్యంగా అన్నదాతల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేస్తుందని గుర్తుచేశారు. రైతుల ఇబ్బందులను గుర్తించి వెంటనే స్పందించినందుకు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే మురళీ నాయక్ ను సిపిఎం నాయకులు కలిసి గ్రామంలోని పలు పెండింగ్ సమస్యలపై వినతి పత్రం అందజేశారు.గ్రామంలోని బొడ్రాయి సమీపంలో ప్రధాన రహదారిపై పెద్ద గుంత ఏర్పడిందని, నిత్యం రాకపోకలు సాగించే వాహనదారులకు ఇది ప్రమాదకరంగా మారిందని వివరించారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు.గ్రామంలోని పలు కీలక ప్రాంతాల్లో చీకటి రాజ్యమేలుతోందని, ప్రజల సౌకర్యార్థం కింది ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు.స్మశాన వాటిక నుండి కొనుగోలు కేంద్రం మెయిన్ రోడ్డు వరకు, చర్చి నుండి బతుకమ్మ ఘాట్ వరకు, హైస్కూల్ నుంచి ప్రభుత్వ ఆసుపత్రి అలాగే కరెంటు ట్రాన్స్ ఫార్మర్ వరకు ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# బయ్యారంలో గ్రీన్ స్టీల్..

- హైదరాబాద్ లో ఈవీ' హబ్!
- కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక భేటీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18(ప్రభాత గమనం):**

తెలంగాణ పారిశ్రామికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి కోరారు. శనివారం ఢిల్లీలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి H. D. కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో ఆయన సమావేశమయ్యారు. 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌లో భాగంగా రాష్ట్రంలో భారీ పరిశ్రమల ఏర్పాటుపై చర్చించారు. బయ్యారంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉక్కు పరిశ్రమను పర్యావరణహిత 'గ్రీన్ స్టీల్ ప్లాంట్'గా ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు. హైడ్రోజన్ ఆధారిత సాంకేతికతతో ఉక్కు తయారీ చేపట్టడం ద్వారా కాలుష్యం తగ్గించవచ్చని తెలిపారు. పాత వాహనాల స్క్రాప్‌ను రీసైక్లింగ్ చేసి ఉక్కు తయారు చేసే యూనిట్‌ను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే హైదరాబాదును గ్లోబల్ పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి పలు ప్రతిపాదనలు చేశారు. నగరంలో హైడ్రోజన్ ఆధారిత గ్రీన్ స్టీల్ క్లస్టర్, ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. రక్షణ, ఆటోమొబైల్ రంగాలకు అవసరమైన విడిభాగాల తయారీ యూనిట్లు, మెషిన్ టూల్స్, రోబోటిక్స్ పార్కులను కూడా ఏర్పాటు చేయాలని తెలిపారు. 2034 నాటికి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. నగరంలోని సాధారణ వాహనాలను దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు కేంద్ర సహకారం అవసరమని చెప్పారు. ఆధునిక పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు జాతీయ స్థాయి స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, కేంద్ర ప్రాజెక్టుల ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రతిపాదనలపై కేంద్ర




మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

## సింగర్ మంగ్లీని సినీ ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలి

**హైదరాబాద్, ప్రభాత గమనం:**

సింగర్ మంగ్లీని సినిమా ఇండస్ట్రీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేస్తూ మా అసోసియేషన్ ప్రొడ్యూసర్ కౌన్సిల్‌కు తెలంగాణ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సంపత్ నాయక్ ఫిర్యాదు చేశారు. నిరుపేద బాధితులకు న్యాయం జరిగే వరకు మంగ్లీని బహిష్కరించాలన్న ఆయన డిమాండ్ చేశారు. కాగా, మైక్రో ఫైనాన్స్ పేరిట డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలపై పంజాగుట్ట పీఎస్ లో మంగ్లీపై కేసు నమోదైన విషయం విదితమే.




## డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

**మహబూబాబాద్ ఏప్రిల్ 18(ప్రభాత గమనం):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో దుర్గాబాయి దేశముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణా సంస్థ, హైదరాబాద్ నందు మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులకు 2026-2027 విద్య సంవత్సరానికి తల్లిదండ్రులు కోల్పోయిన బాలికలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన బాలికలకు, దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న అక్రమ రవాణాకు గురైన వికలాంగుల బాలికల నుండి మాత్రమే డిప్లమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయని జిల్లా సంక్షేమ అధికారి సబిత నేడు ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు..ప్రతి కోర్సులో 60 సీట్లకు గాను, మొత్తం 360 సీట్లలో 70 శాతం తల్లిదండ్రులు కోల్పోయిన (అనాధ) బాలికలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన నిరుపేద బాలికలకు మరియు దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న బాలికల లకు కేటాయించబడతాయని తెలిపారు. వీరు పాలిటెక్నిక్ అర్హత ప్రవేశ పరిక్ష రాయకున్నా కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని 3 శాతం సీట్లు దివ్యాంగులకు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఇందులో ఎంపికైన బాలికలకు ఉచిత విద్యతో పాటు వసతిని కూడా కల్పించబడుతుందన్నారు. ఈ క్రింద తెలుపబడిన ధ్రువపత్రాలను జత చేసి దరఖాస్తు చేయగలరు. కులం, ఆదాయ ధృవీకరణ (అనాధ బాలికలకు అవసరం లేదు), తల్లి తండ్రుల మరణ ధృవీకరణ పత్రములు, స్కూల్ బోనఫైడ్ సర్టిఫికెట్ బాల రక్షా భవన్ (జిల్లా బాలల పరిరక్షణ విభాగం) నర్సంపేట రోడ్, గాయత్రి గుట్ట సమీపంలో, సఖి సెంటర్ పైన మొదటి అంతస్తు లో కార్యాలయంలో లభించే దరఖాస్తు ఫారంనకు సంబందిత ధ్రువపత్రాలను జత చేసి బాల రక్షా భవన్, మహబూబాబాద్ కార్యాలయము నందు మే 20 న, 2026 లోగా దరఖాస్తులు సమర్పించాలని అన్నారు. ఇతర వివరాలకు బాల రక్షా భవన్ (జిల్లా బాలల పరిరక్షణ విభాగం) 9032427241, 9490114596, 8331007001 లను సంప్రదించగలరని ఈ సందర్భంగా అధికారి పేర్కొన్నారు.

## ఆదివాసీల ఉనికిపై సర్కారు 'గణాంకాల' దాడి

- నాయకపోడుల గొంతు నొక్కుతున్న కుల గణన!
- ఆదివాసీ నాయకపోడు జిల్లా ప్రధాన కార్యదర్శి దెబ్బ శ్రీను

**డోర్నకల్, ప్రభాత గమనం :**



తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక కుల సర్వే క్షేత్రస్థాయి వాస్తవాలను వక్రీకరిస్తోందని, ఇది ఆదివాసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని ఆదివాసి నాయకపోడు జిల్లా ప్రధాన కార్యదర్శి దెబ్బ శ్రీను తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేస్తామని చెబుతూనే, తరతరాలుగా అడవిని, నేలను నమ్ముకున్న ఆదివాసి తెగల జనాభాను అధికారిక లెక్కల నుంచి ఉద్దేశపూర్వకంగా తుడిచిపెట్టడం దారుణమని ఆయన ధ్వజమెత్తారు.ప్రభుత్వం విడుదల చేసిన తాజా గణాంకాలు చూస్తుంటే విస్మయం కలుగుతోందని దెబ్బ శ్రీను పేర్కొన్నారు.2011 జనాభా లెక్కల ప్రకారమే రాష్ట్రవ్యాప్తంగా గోండు ఉపతెగ అయిన నాయకపోడుల జనాభా సుమారు 10 లక్షల వరకు ఉండగా, అందులో నాయకపోడులే 6.50 లక్షల పైచిలుకు ఉన్నారు.గత 15 ఏళ్లలో ఈ జనాభా ఇంకా పెరగాల్సింది పోయి, తాజా సర్వేలో కేవలం 16,510 గా చూపడం హాస్యాస్పదమని ఆయన మండిపడ్డారు.అసలు సర్వే అధికారులు గ్రామాల్లోకి వెళ్లారా? లేక ఏసీ గదుల్లో కూర్చుని కాగితాల మీద అంకెలు సరిదిద్దారా? అని ఆయన ప్రశ్నించారు.ఒక్కో నియోజకవర్గంలో 25 నుంచి 30 వేల వరకు ఓటు బ్యాంకు ఉన్న శక్తివంతమైన సామాజిక వర్గాన్ని, రాష్ట్రం మొత్తం కలిపి 16 వేలకు పరిమితం చేయడం వెనుక లోతైన కుట్ర దాగి ఉందని దెబ్బ శ్రీను ఆరోపించారు.ఇది కేవలం గణాంకాల లోపం కాదు.. ఒక జాతి అస్తిత్వంపై జరుగుతున్న దాడి. నాయకపు, నాయకపోడులను సామాజికంగా, రాజకీయంగా సమాధి చేయడమే ఈ కుట్ర ముఖ్య ఉద్దేశం." అని పేర్కొన్నారు. నాయకపు, నాయకపోడు ప్రజలు అత్యధికంగా మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్నారని, ప్రభుత్వం తెగల వారీగా విభజన చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి అట్టడుగు వర్గాల జనాభాను బలి చేస్తోందని, తక్షణమే ఈ తప్పులను సరిదిద్ది వాస్తవ గణాంకాలను వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివాసి జాతుల ఉనికి కోసం పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## సీపీఐ సీనియర్ నేత పోతుల నరసింహారావు కన్నుమూత

- నివాళులర్పించిన అఖిలపక్ష నాయకులు

**గార్ల, ఏప్రిల్ 18(ప్రభాత గమనం):**

గార్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ మండల కార్యదర్శి పోతుల నరసింహారావు (70) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి గార్ల మండల రాజకీయాల్లో మరియు వామపక్ష వర్గాల్లో తీరని లోటును మిగిల్చింది.నరసింహారావు గారి మరణవార్త తెలిసిన వెంటనే వివిధ పార్టీల నాయకులు ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పోతుల నరసింహారావు గారు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడిన నాయకుడని, ఆయన నిరాడంబర జీవితం అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు.బీఆర్ఎస్: మండల పార్టీ అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, మాజీ ఎంపీటీసీ శీలంశెట్టి రమేష్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కట్టబోయిన శ్రీనివాస్, మండల కార్యదర్శి జంపాల వెంకన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, న్యూ డెమోక్రసీ నాయకులు సక్రు, మాన్య, టీడీపీ నాయకులు కత్తి సత్యం, నరసింహారావు, మండల కార్యదర్శిగా ఉన్న కాలంలో పార్టీ బలోపేతానికి, పేదల హక్కుల కోసం చేసిన సేవలను నాయకులు గుర్తుచేసుకున్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యాన్ని చెప్పారు.




## రోడ్డు ప్రమాదాలను నివారించాలి

- మడికొండ సీఐ పుల్యాల కిషన్

**ప్రభాత గమనం. వరంగల్ క్రైమ్ బ్యూరో**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశ పెట్టిన ప్రజా పాలన ప్రగతి నివేదన కార్యక్రమంలో రోడ్డు ప్రమాదాలను నివారించడం లో భాగంగా అర్రైవ్ అలీవ్ కార్యక్రమంలో భాగంగా ఈరోజు మడికొండ గ్రామంలో ఉదయం హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ పెట్టుకోకుండా వచ్చే వారిని గుర్తించి వారిని హెల్మెట్ పెట్టుకోమని సూచించడం జరిగింది. అనంతరం సాయంత్రం సమయంలో మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల ప్రజలను సమీకరించి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలను తీసుకుని వచ్చి వారి ద్వారా ఆ కుటుంబాల సాధక భాదకాలను తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ మాట్లాడుతూ తెలంగాణ పోలీస్ డీజీపీ శివధర్ రెడ్డి ఆశల రూపంగా చిగురించిన అర్రైవ్ అలీవ్ కార్యక్రమం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించి దీనిని ప్రజపాలన ప్రగతి నివేదనలో భాగం చేశారు. ప్రజలందరు తప్పనిసరిగా రోడ్డు మీద ప్రయాణం చేసేటప్పుడు హెల్మెట్ ధరించాలని రక్షణాత్మక డ్రైవింగ్ విధానం అలవర్చుకోవాలని సూచించారు.





## ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

- ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ

**వరంగల్ క్రైమ్ బ్యూరో, ప్రభాత గమనం :**

రోడ్డు నిబంధనలు పాటించడం వ్యక్తిగత బాధ్యతని వాహనదారుడు భావించాలని ట్రాఫిక్ ఏసిపి తెలిపారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "అరైవ్-ఆలైవ్" కార్యక్రమంలో భాగంగా హనుమకొండ ట్రాఫిక్ పోలీసులు వినూత్న అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటిస్తున్న వాహనదారులను గుర్తించి, వారికి ప్రోత్సాహం అందించే విధంగా ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఇన్స్ స్పెక్టర్ సీతారెడ్డి "ఆరైవ్ ఆలైవ్ ఛాంపియన్-2026" స్టిక్కర్లను వారి వాహనాలపై అంటించి వాహనదారులకు పూలు అందించి అభినందించారు. వాహనదారులకు హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, వేగ పరిమితులను పాటించాల్సిన తీరుపై ట్రాఫిక్ పోలీసులు అవగహనా కల్పిస్తూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించే వారిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా ఇతరులకు స్ఫూర్తి కలిగించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా ఏసీపీ తెలిపారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ "ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలను కాపాడుకోవడమే కాకుండా, ఇతరుల ప్రాణాలను కూడా రక్షించగలరని. 'ఆరైవ్-ఆలైవ్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాటు పెంపొందించడం మా లక్ష్యమని. నిబంధనలు పాటించే వాహనదారులను 'ఆరైవ్ ఆలైవ్ ఛాంపియన్స్'గా గుర్తించి సత్కరించడం ద్వారా సమాజంలో మంచి సందేశాన్ని వ్యాప్తి చేస్తున్నామని . ప్రతి వాహనదారుడు ఛాంపియన్‌గా మారాలని కోరుకుంటున్నాము." ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో హన్మకొండ ట్రాఫిక్ ఎస్. ఐ ఫసి, ఏ. ఎస్. ఐ శ్రీనివాస్తో పాటు ఇతర ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.




## ఘనంగా డాక్టర్ జోత్స్నరెడ్డి పుట్టిన రోజు వేడుకలు

- వైద్యం వృత్తి కాదు.. సేవ అని నిరూపిస్తున్నారు : ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్

**మహబూబాబాద్ ఏప్రిల్ 18(ప్రభాత గమనం):**

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వెన్నెల ఉమెన్స్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో ప్రముఖ వైద్యురాలు డా. జోత్స్నరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. మానవత్వానికి ప్రతిరూపంగా నిలిచి, పేదలకు వైద్య సేవలందిస్తున్న ఆమెకు సంఘీభావంగా మహబూబాబాద్ జిల్లా ప్రైవేట్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ప్రముఖ చిల్డ్రన్ స్పెషలిస్ట్ డా.సుధీర్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జోష్ణ రెడ్డికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ..డాక్టర్ జోష్ణ రెడ్డి వైద్య వృత్తికే వన్నె తెస్తున్నారని కొనియాడారు. "వైద్యం ఆమెకు కేవలం వృత్తి మాత్రమే కాదని, అదొక జీవన విధానం. ఎందరో నిస్సహాయులకు, కుటుంబాలకు ఆమె అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి" అని వారు అభిప్రాయపడ్డారు.ఈ వేడుకల్లో అసోసియేషన్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చారు.ఆసుపత్రి ప్రాంగణంలో ఆనందభరిత వాతావరణంలో జరిగిన ఈ వేడుకలు సమాజానికి ఒక గొప్ప సందేశాన్ని అందించాయి. నిరంతరం రోగుల సేవలో గడిపే వైద్యులకు ఇలాంటి ఆత్మీయ గౌరవం దక్కడం స్ఫూర్తిదాయకమని పలువురు వ్యాఖ్యానించారు. డాక్టర్ జోష్ణ రెడ్డి మరిన్ని పుట్టినరోజులు జరుపుకుంటూ, ప్రజారోగ్య రంగంలో తనదైన ముద్ర వేయాలని అందరూ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గండు మురళి, ఉపాధ్యక్షుడు వెంకన్న, వెంకన్న, జనరల్ సెక్రటరీ చేపూరి రవి, జాయింట్ సెక్రటరీ సలీం, కోశాధికారి రాంబాబు, గౌరవ సలహాదారుడు హీమాయిద్దిన్, వ్యాయామ ఉపాధ్యాయుడు వినోద్ తదితరులు హాజరయ్యారు.

## 'మహిళా' బిల్లుపై ఇండియా కూటమి ద్వంద్వ వైఖరి

- మండిపడిన బీజేపీ నేతలు
- కేసముద్రంలో విపక్షాల దిష్టిబొమ్మ దగ్ధం

**కేసముద్రం ఏప్రిల్ 18(ప్రభాత గమనం):**

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం కాంగ్రెస్ అలాగే ఇండియా (ఐఎన్డిఐ) కూటమి పార్టీల ద్వంద్వ నీతికి నిదర్శనమని బీజేపీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల రమేష్ తీవ్రంగా విమర్శించారు. శనివారం కేసముద్రం మండల కేంద్రంలోని పులే సెంటర్ వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, లెఫ్ట్ మరియు ఇండియా కూటమి పార్టీల దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పునూతల రమేష్ మాట్లాడుతూ... దేశాభివృద్ధిలో మహిళలకు సముచిత స్థానం కల్పించాలనే సంకల్పంతో ప్రధాని మోదీ ప్రభుత్వం మహిళా



రిజర్వేషన్ బిల్లును ప్రతిపాదిస్తే, ప్రతిపక్షాలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. మహిళల హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలను మహిళా లోకం ఎన్నటికీ క్షమించదని ఆయన హెచ్చరించారు.అనంతరం జిల్లా ఉపాధ్యక్షులు పొదిల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఒకవైపు బీజేపీ మహిళా సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తుంటే, ఇండియా కూటమి మాత్రం అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. మహిళల పట్ల వివక్ష చూపుతున్న పార్టీలకు రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బోగోజు నాగేశ్వర చారి, ఉపాధ్యక్షులు చలగోల వెంకన్న, భూక్య బాలు నాయక్, బచ్చు లక్ష్మీనారాయణ, లెక్కలపల్లి శ్రీనివాస్, మహమ్మద్ ఖాసిం, అయిత సారయ్య, సింగంశెట్టి మధు, గుండు దామోదర్, వేల్పుల ఐలయ్య, బెజ్జం సురేష్, పోలేపల్లి సంపత్ రెడ్డి, మనిశెట్టి నాగయ్య, ఏకాంబరం, బొద్దుల సతీష్ పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374